TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక : 29 | బుధవారం, మే 8, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4



2లో...

ప్రభుత్వం పడిపోతుందని

## కేసీఆర్ అంటున్నారు...

### నేను అల్లాటప్పాగా రాలేదు: రేవంత్ రెడ్డి వ్యాఖ్య

హన్మకొండ,మే7: అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే తమ ప్రభుత్వం పడిపోతుందని కేసీఆర్ అంటున్నారని... కానీ సీఎం పదవి నుంచి దిగిపోవడానికి తాను అల్లాటప్పాగా రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యమం పేరు చెప్పి పిల్లలను చంపి తానేమీ పదవిలోకి రాలేదని ఎత్తిపొడిచారు. మంగళవారం నాడు హన్మకొండలో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పదేళ్లు విధ్వంసం సృష్టించిన కేసీఆర్ మళ్లీ వచ్చి ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు.

మూడోదశ పోలింగ్‌లో

## ఓటేసిన ప్రముఖులు

- అహ్మదాబాద్‌లో ఓటేసిన ప్రధాని మోడీ
- ఓటు హక్కు వినియోగించుకున్న అమిత్ షా
- భార్యతో కలసి ఓటేసి గౌతమ్ ఆదానీ..



2లో...

న్యూఢిల్లీ,మే7: సార్వత్రిక సమరంలో మూడో దశ పోలింగ్ మంగళవారం కొనసాగింది. ఈ విడతలో 11రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 93 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్ సాగింది. అత్యదికంగా బెంగాల్లో ఓటింగ్ నమోదయ్యింది. చెదురుముదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లో ఓటేశారు. గుజరాత్‌లోని అహ్మదాబా ద్‌లోని పోలింగ్ బూత్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆయన సతీమణి సోనాల్ షా, కుమారుడు, బీసీసీఐ కార్యదర్శి జైషా ఓటు హక్కు వినియోగించుకున్నారు. యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలో సీఎం భూపసేంద్రపటేల్ అందరితోపాటు లైన్లో నిల్చోగా.. గత ఏడాది బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన ఆయన కుమారుడు అనుజ్ పటేల్ వీల్‌ఛైయిర్‌లో వచ్చి ఓటేశారు.



2లో...

పోలింగ్‌కు మండుటెండల

## భయం..

- రెండు దఫాల్లోనూ తగ్గిన ఓటింగ్ శాతం
- మూడో దశలోనూ మందకొడిగా పోలింగ్

న్యూఢిల్లీ,మే7 :మొదటి రెండు దశలలో ఓటింగ్ శాతం 2019 ఎన్నికల నాటికన్నా దాదాపు 5శాతం తక్కువగా ఉండటం కలవరం కలిగిస్తోంది. ఓటర్లలో,ముఖ్యంగా అధికార పార్టీకి మద్దతుదారులతో నెలకొన్న నిర్లిప్తతే అందుకు కారణంగా పరిశీలకులు భావిస్తున్నారు.
ఎండలుకూడా మండిపోవడంతో ప్రజలు ఇళ్లు వదిలి రావడం లేదు. మూడో విడత మంగళవారం ప్రారంబం అయ్యింది. ఉదయం నుంచే మందకొడిగానే సాగుతోంది. దీనిని బట్టిప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుతోంది. ఇంతటి ఎండల్లో ఎన్నికలు నిర్వహించే బదులు మరో ప్రత్యామ్నాయ తేదీలను ఇసి సూచించి ఉంటే బాగుండేది. ఎండల కారణంగా ప్రచారంలో నేతలు కూడా అపసోపాలు పడుతున్నారు.



2లో...

తెలంగాణలో కాస్త

## ఉపశమనం

అక్కడక్కడా చిరుజల్లులు
నగరంలో పలుచోట్ల స్వల్ప వర్షం
కొన్నిచోట్ల చల్లబడ్డ వాతావరణం

హైదరాబాద్,మే7 : మండుతున్న ఎండల నుంచి తెలంగాణ రాష్ట్రంలో కాస్త ఉపశమనం కలిగింది. ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్‌లోనూ కొన్నిచోట్ల చిరుజల్లులు కురవడంతో తెల్లవారుతుండగానే ప్రజలు హమ్మయ్యా అంటూ ఉపశమనం పొందారు. తెలంగాణ వ్యాప్తంగా ఐదురోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దీనివల్ల ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గే అవకాశం ఉంది. తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది.



బిజెపిలో చేరిన నటుడు

## శేఖర్ సుమన్

న్యూఢిల్లీ,మే7 : ప్రముఖ నటుడు శేఖర్ సుమన్, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రతినిధి రాధిక ఖేర బీజేపీలో చేరారు. మంగళవారం న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాల యంలో వారిద్దరికి ఆ పార్టీ నేత వినోద్ తాద్వే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. అనంతరం రాధిక ఖేర మాట్లాడుతూ.. అయోధ్యలోని రామ మందిరాన్ని దర్శించిన అనంతరం కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలు తనను లక్ష్యంగా చేసుకున్నా రని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జోడో న్యాయ యాత్ర చేస్తున్న సమయంలో.. పార్టీలోని కీలక నేత సుశీల్ ఆనంద్ సుఖ్ తనతో వ్యవహరించిన తీరును వివరించారు.



2లో...



కాంగ్రెస్ వస్తే మళ్లీ..

## బాంబుల మోత

### అన్నామలైతో కలసి సంగారెడ్డిలో రఘునందన్ బైక్ ర్యాలీ

సంగారెడ్డి,మే7: ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సంగారెడ్డిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తే అయోధ్య స్థానంలో మళ్లీ బాబ్రీ మసీదు కడతారని, మళ్లీ దేశమంతా బాంబులు పేలుతాయని అన్నారు. అదే బీజేపీ అధికారంలోకి వస్తే కేవలం దీపావళికి మాత్రమే బాంబులు పేలుతాయన్నా రు.

## నన్ను అరెస్ట్ చేయాలని మోదీ చూస్తున్నారు..: కేసీఆర్

- తాను అవినీతి చేయలేదు కాబట్టే మోదీకి దొరకలేదన్న కేసీఆర్
- మద్యం పాలసీలో కుంభకోణం సృష్టించి కవితను ఇరికించారని ఆరోపణ
- కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని స్పష్టీకరణ
- దక్షిణాదిలో బీజేపీకి 12 సీట్లు వస్తే ఎక్కువన్న బీఆర్ఎస్ అధినేత



2లో...

జగిత్యాల,మే7 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనను కూడా జైలుకు పంపేందుకు ప్రయత్నించారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంచలన ఆరోప ణలు చేశారు. మోదీకి లొంగని వ్యక్తుల్లో తాను, కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ ఉన్నామని, వారిద్దరినీ అనుకున్నట్టే జైలుకు పంపినా తనెక్కడా అవినీతికి పాల్ప డకపోబట్టే మోదీకి తాను దొరకలే దని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాలలో నిన్న ప్రచారం నిర్వహించిన కేసీఆర్ 'ఈనాడు-ఈటీవీ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈవ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మద్యం కేసు అనేది మోదీ వికృత రూపానికి నిదర్శనమని దుయ్యబట్టారు.



2లో...

పట్టభద్ర ఎమ్మెల్సీగా

## రాకేశ్ రెడ్డి నామినేషన్

### ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తదితరుల హాజరు

నల్లగొండ,మే7 : నల్లగొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎ్నికకు బీఆర్ఎస్ పార్టీ తరపున ఏనుగుల రాకేశ్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో రిటర్నింగ్ ఆఫీసర్‌కు రాకేశ్ రెడ్డి నామినేషన్ పత్రాలను అందజే శారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, జనగామ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి,పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గన్నారు. సొంతూరు.. హన్మ కొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం వంగ పహాడ్. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన రాకేశ్ రెడ్డి.. బిట్స్ పిలానీలో మాస్టర్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్ పూర్తి చేశారు.



2లో...

కేజ్రీవాల్ బెయిల్‌పై

## వాడీవేడీ వాదనలు..

### కేజ్రీని ప్రజలు ఎన్నికున్న సిఎం అన్న సుప్రీం - ఎప్పడూ నేరాలు చేసే వ్యక్తి కాదని వెల్లడి

న్యూఢిల్లీ,మే7: లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ సీఎం కేజీవ్రాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేజీవ్రాల్ అలవాటుగా నేరాలు చేసే వ్యక్తి కాదు.. ఆయనకు బెయిల్ ఎందుకు ఇవ్వకూడదని ఈడీని ప్రశ్నించింది. ఎన్నికల సందర్భంగా ఆయన ప్రచారం చేయాల్సిన అవసరంఉందని అభిప్రాయపడింది. కేజీవ్రాల్ దాఖలు చేసిన మధ్యం తర బెయిల్ పిటిషన్ పై ఇవాళ సుప్రీంలో విచారణ జరిగింది. ఈడీ తరపున న్యాయవాది తుషార్ మెహతా, కేజ్రవాల్ తరపున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా,జస్టిస్ దీపాంకర్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ ఎన్నికలు ఐదేళ్లకు ఒకసారి వస్తాయని అభిప్రా యపడింది. నేరారోపణలు ఉన్న రాజకీయ నాయకుల పట్ల భిన్నంగా వ్యవహరిం చడం తమకు ఇష్టం లేదని తెలిపింది....



కెసిఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు : జగదీష్ రెడ్డి

**నల్లగొండ,మే7 :** కేసీఆర్‌బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో వణుకు మొదలైంది. కేసీఆర్ పని అయిపోయింది అనుకున్న వాళ్లందరూ ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే భయపడి పోతున్నారని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి నామినేషన్ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని లక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గోదావరిని తీసుకెళ్లి కావేరిలో కలిపే కుట్రలు మోదీ నేతృత్వంలో మొదలయ్యాయి. దీన్ని ఆపాలంటే ఒక్క కేసీఆర్ తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు పక్క రాష్ట్రాల ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తారు. తెలంగాణ ప్రయోజనాలు ఆ పార్టీలకు పట్టవని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ఌ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని గెలిపించేందుకు మోదీ సహకరించారు. ఎంపీ ఎన్నికల్లో మోదీని గెలిపిం చేందుకు రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నాడని విమర్శించారు. గత ఎన్నికల ఫలితాల్లోనూ వీరికుమ్మక్కు రాజకీయాలు స్పష్టం అయ్యాయని పేర్కొన్నారు. మై నారిటీలను ఓట్ల కోసమే కాంగ్రెస్ వాడుకుంటుంది.

పంటల బీమాపై రైతుల్లో...

## కానరాని అవగాహన

### పంటలు దెబ్బతింటే ప్రభుత్వంపైనే ఆధారం - రైతులను చైతన్యం చేయడంలో వ్యవసాయశాఖ విఫలం

న్యూఢిల్లీ,మే7 : ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వారిని ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించి నప్పడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్తితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్దిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాలవర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది.



2లో...

## ప్రభుత్వం పడిపోతుందని
# కేసీఆర్ అంటున్నారు...



- నేను అల్లాటప్పాగా రాలేదు: రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- పదేళ్లు విధ్వంసం సృష్టించిన కేసీఆర్ మళ్లీ వచ్చి ఓట్లు అడుగుతున్నారు...
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్‌లో మార్పు వస్తుందని భావించా: ముఖ్యమంత్రి
- రైతులకు క్షమాపణ చెప్పిన తర్వాత ఓట్లు అడుగుతారని భావించామని వ్యాఖ్య
- తెలంగాణకు మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శ

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్‌లో మార్పు వస్తుందని భావించామని... రైతులకు క్షమాపణ చెప్పిన తర్వాత ఓట్లు అడుగుతారనిభావించామని..కానీఅదేమీ జరగలేదన్నారు. పైగా మూడు నెలలకే తమ ప్రభుత్వం పడిపోతుందని వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. విభజన చట్టంలోనే యూపీఏ ప్రభుత్వం తెలంగాణకు భారీ పరిశ్రమలు ఇచ్చిందని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని నిర్మించాలని చెప్పిందని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని చెప్పిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు ఐటీఐఆర్ ప్రాజెక్టును కూడా యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. కానీ విభజన చట్టంలోని హామీలను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులను మోదీ గుజరాత్‌కు తరలించారని ఆరోపించారు.

# పోలింగ్‌కు మండుటెండల భయం..



మొదటి పేజీ తరువాయి

అయితే, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నవారు ఎట్లాగూ గెలిచే అవకాశం లేదని ఓటర్లు పోలింగ్‌కు రావడం లేదని, బిజెపి మద్దతు దారులు మాత్రం పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొంటున్నారని అమిత్ షా చెప్పారు. అదే నిజమైతే ప్రధాని, ఇతర నాయకులు కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శల దాడులకు దిగే అవకాశం వచ్చెడిది కాదు. మూడో దశ పోలింగ్‌కు ముందు బిజెపి అభ్యర్థులకు ప్రధాని మోడీ రాసిన బహిరంగ లేఖలో కాంగ్రెస్ తిరోగమన రాజకీయాలను ఎండగట్టాలని పిలుపిచ్చారు. తమ వైఫల్యాలు కాంగ్రెస్‌కు ఎక్కడ ప్రాణం పోస్తాయో అని ప్రధాని మోడీ ఆందోళన చెందుతున్నట్లుగా ఉంది. అలాగే ఇదే విషయంలో కాంగరెస్ కూడా ధీమాగా ఉంది. మోడీ అపసవ్య విధానాలు తమను గెలిపిస్తాయని భావిస్తున్నారు. మరో పక్క, 75 ఏళ్లలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ పక్షాలు ఖర్చు చేస్తున్నాయి. మితిమీరిన ఎన్నికల వ్యయం మన ప్రజాస్వామ్యం ఉనికి సవాల్‌గా మార్చే విధంగా కనిపిస్తున్నది. 2019 ఎన్నికలలో రూ. 60,000 కోట్లు ఖర్చు చేస్తే,ఈ పర్యాయం అందుకు రెట్టింపుకన్నా ఎక్కువుగా రూ. 1.35 లక్షల కో ట్లు ఖర్చు చేసే అవకాశం ఉందని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ పేర్కొంది. 35ఏళ్లుగా ఎన్నికల వ్యయాన్ని మదింపు చేస్తున్న ఆయన ఈమొత్తాన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, అభ్యర్థులు, ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌తో సహా ఎన్నికలకు సంబంధించిన అన్ని ఖర్చులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కలిగి ఉంటుందని తెలిపారు. అయితే, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి వరుసగా మూడోసారి అధికారం లోకి రావడం కోసం ప్రచారం కోసం చేస్తున్న వ్యయంలో అందరికన్నా చాలా అత్యధి కంగా చేయడం కనిపిస్తున్నది. అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్ (ఎడిఆర్) ఇటీవల జరిపిన పరిశీలన భారత దేశంలో రాజకీయ నిధులలో 'గణనీయమైన పారదర్శకత లోపాన్ని' వెల్లడిస్తుంది. 2004-05 నుండి 20 22-23వరకు, దేశంలోని ఆరు ప్రధాన రాజకీయ పార్టీలకు సుమారు 60 శాతం విరాళాలు, మొత్తం రూ. 19,083 కోట్లు,ఎలక్టోరల్ బాండ్ల నిధులతో సహా తెలియని మూలాల నుండి వచ్చినట్లు వెల్లడైంది. అంటే మన ఎన్నికల వ్యవస్థపై పెరుగుతున్న నల్లధనం, ఆర్థిక నేరస్థుల ప్రభావం ఆందోళన కలిగిస్తున్నది. గతంలో ఏనాడూ లేని విధంగా ఈ ఎన్నికలలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఒక విధంగా 'అక్రమ సంపాదనాపరులు'ను నిలబె ట్టేందుకు పోటీపడ్డాయి.ఇదే సమయంలో బిజెపి 400 స్థానాలు గెలవాలని ఎందుకు కోరుకొంటున్నదనే ప్రశ్న ఆపార్టీని ఆత్మరక్షణలో పడవేస్తుంది. పలువురు బిజెపి మంత్రులు, ఎంపిలు తమకు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చి వేస్తామని ప్రకటనలు చేస్తే బిజెపి కేంద్ర నాయకులు ఎవ్వరూ ఖండించలేదు. కానీ ఇప్పుడు 400సీట్లు వస్తే రాజ్యాంగం మార్పు పేరుతో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లను రద్దు చేస్తారని ప్రతిపక్షాలు ప్రచారం ప్రారంభిస్తే బిజెపికంగారు పడుతున్నది. స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత డా. మోహన్ భగవత్ రంగంలోకి దిగి తామెప్పుడూ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని స్పష్టం చేయాల్సి వచ్చింది. పరోక్షంగా రాజ్యాంగం మార్పు అంశం ప్రతిపక్షాలకు బలమైన ఆయుధం సమకూర్చినట్లు అయింది.

# నన్ను అరెస్ట్ చేయాలని మోదీ చూస్తున్నారు..: కేసీఆర్



మొదటి పేజీ తరువాయి

మద్యం పాలసీలో కుం భకోణాన్ని సృష్టించి అందులో కవితను ఇరికించారని ఆరోపించారు. పదేళ్ల తమ పాలనలో అద్భుతాలుచేశామన్న కేసీఆర్ ఐదు నెలల పాలనలోనే ప్రజల్ని రాచిరంపాన పెడుతోందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో తప్పకుండా ప్రభావం కనిపిస్తుందని, బీఆర్ఎస్ గణనీయమైన సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలు తమ పాలనకురెఫరెండమన్న సీఎం రేవంత్‌రెడ్డి తోకముడిచారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని, పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అనిశ్చితి ఏర్పడబోతోందని జోస్యం చెప్పారు. కేంద్రంలో ఎన్డీయేకు మెజార్టీ వచ్చే పరిస్థితి ఎంతమాత్రమూ లేదన్న కేసీఆర్..వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తుడిపెట్టుకు పోతుందన్నారు. దక్షిణాదిలో బీజేపీకి 12 సీట్లు వస్తేనే ఎక్కువని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

# పంటల బీమాపై రైతుల్లో కానరాని అవగాహన

**పంటలు దెబ్బతింటే ప్రభుత్వంపైనే ఆధారం - రైతులను చైతన్యం చేయడంలో వ్యవసాయశాఖ విఫలం**

మొదటి పేజీ తరువాయి

కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు,విలయం సంభవించినప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పదిశాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్ర స్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయకపోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఖరారయ్యాయి. సీజన్‌కు సంబంధించి బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఈ సీజన్‌లో అత్యధికంగా వరి, మొక్కజొన్న , పత్తి, పెసర, మినుము సాగయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో పరిస్థితి అనుభవిస్తే కానీ తెలియని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది స్పష్టం కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటల కు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు ఈ బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు.

## మూడోదశ పోలింగ్‌లో
# ఓటేసిన ప్రముఖులు

మొదటి పేజీ తరువాయి

అలాగే ఆదానీ దంపతులు కూడా క్యూలో వచ్చి ఓటేశారు. మహమ్మద్‌పురా ప్రైమరీ స్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లోఆయన ఓటేశారు. ఇవాళ దేశవ్యాప్తంగా 10రాష్ట్రాల్లో 93 సీట్లకు మూడవ దశ లోక్‌సభ పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఓటేసిన తర్వాత అదానీ మీడియాతో మాట్లాడారు. తన ఫ్యామిలీతో కలిసి ఓటింగ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. ఓటేయడం గర్వంగా ఉందన్నారు. ప్రతి పౌరుడు ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. భారత్ ప్రగతి దిశగా ముందుకు వెళ్తోందని, మరింత ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలక్షన్ రోజుకు ఉన్న ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో జరిగే అతిపెద్ద పండుగ ఇదే అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక ఓటు శక్తివంతమైందని ఆయన తన ట్వీట్‌లో తెలిపారు. భారత భవిష్య త్తును తీర్చిదిద్దేందుకు ఓటును వేయాలని ఆయన కోరారు.మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, భాజపా విదిశ అభ్యర్థి శివరాజ్ సింగ్ చౌహాన్ కుటుంబం ఓటింగ్‌లో పాల్గొంది. సినిమా ఇండస్ట్రీకి చెందిన రితేశ్ దేశ్‌ముఖ్, ఆయన భార్య జెనీలియా,ఆయన సోదరుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే ధీరజ్ దేశ్‌ముఖ్.. లాతూర్‌లో ఓటేశారు. కేంద్రమంత్రులు మన్‌సుఖ్ మాండవీయ,



ప్రహ్లాద్‌జోషి,జ్యోతిరాదిత్య సింధియా, జామ్‌నగర్ భాజపా ఎమ్మెల్యే రివాబా జడేజా, ఎన్‌సీపీ-ఎస్‌సీపీ బారామతి అభ్యర్థి సుప్రియా సూలే, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కుటుంబం, ఎన్‌సీపీ-ఎస్‌సీపీ చీఫ్ శరద్ పవార్, కర్ణాటక మాజీ ముఖ్య మంత్రి యడియూరప్ప కుటుంబం,కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బెంగాల్లో చెదురుము దురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

# బిజెపిలో చేరిన నటుడు శేఖర్ సుమన్




మొదటి పేజీ తరువాయి

ఈ అంశాన్ని పార్టీలోని సీనియర్ నేతలు సచిన్ పైలెట్, జైరాం రమేష్‌కు దృష్టికి తీసుకు వెళ్లి.. ఫిర్యాదు చేశానని తెలిపారు. కానీ సుశీల్ ఆనంద్‌పై వాళ్లు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆమె ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సచిన్ పైలెట్‌కు పోన్ చేస్తే...తనతో మాట్లాడేందుకు ఆయన ఇష్టపడలే దన్నారు. అయోధ్యలోని రామ మందిరాన్ని ఇటీవల రాధిక సందర్శించారు. అందుకు సంబంధించిన పోటోలు, వీడియోలు.. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ.. తనను లక్ష్యంగా చేసుకొందని రాధిక ఆరోపిస్తున్నారు. ఇక శేఖర్ సుమన్ బీజేపీలో చేరడంతో.. ఆయన రాజకీయాల్లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించినట్లు అయింది. గతంలో అంటే..2009లో కాంగ్రెస్ పార్టీఎంపీ అభ్యర్థిగా పాట్నా సాహెబ్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేశారు. ఆయన ప్రత్యర్థిగా బీజేపీ అభ్యర్థి, ప్రముఖ నటుడు శతృఘ్న సిన్హా బరిలో నిలిచారు. అయితే ఈ ఎన్నికల్లో శతృఘ్న సిన్హా విజయం సాధించారు. 2012లో శేఖర్ సుమన్.. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాటి నుంచి ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

# తెలంగాణలో కాస్త ఉపశమనం

మొదటి పేజీ తరువాయి

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించి ంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్‌అలర్ట్‌ను జారీ చేసింది. ఇప్పటికే కురుస్తున్న వర్షాలతో ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత కొనసాగగా.. దక్షిణ తెలంగాణ మాత్రం కాస్తంత చల్లబడింది. ఇప్పటి వరకు 45 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఇప్పుడు కొంచెం దిగొచ్చాయి. నల్గొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గాయి. రానున్న ఐదురోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం బలహీనపడినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మార్చి మధ్యలో నుంచే నిప్పులు కురిపిస్తున్న భానుడి దెబ్బకు ఉడికిపోతున్న తెలంగాణలో వర్షాలు కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆది,సోమవా రాల్లో కురిసిన వానతో వాతావరణం కాస్త చల్లబడింది. కొన్నిచోట్ల వడగండ్ల వా నకురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాతిప్పర్తి మండలం మామిడాలలో 6.5 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లాఆత్మకూరులో 4.7సెం టీమీటర్ల వర్షం పడింది.సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునా థపాలె ంలో 3.5మి.మీ,నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం సింగరాజ్‌పల్లిలో 3.3 మి.మీ,ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలలో 2.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ తెలిపింది. ఎండుతున్న ఎండల నుంచి చిరుజల్లులు హైదరాబాద్ నగరవాసులకు కొంచె ఉపశమనం కలిగించాయి. సోమవారం సాయంత్రం నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం కూడా వాతావరణం చల్లబడటంతోపాటు వివిధ ప్రాంతాల్లో వర్షం కు రిసింది. తెల్లవారుజాము నుంచే తేలికపాటు జల్లులు కురుస్తు న్నాయి.ఒకవైపు వర్షాలు కురుస్తున్నా....మరోవైపు అధిక ఉష్ణోగ్రతలునమో దవుతూనే ఉన్నాయి. జగిత్యాల జిల్లా గుల్లకోట, అల్లీపూర్‌లో అత్యధికంగా 46.8 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4,సుగ్లాంపల్లి, జగిత్యాల జిల్లా కోల్వాయి లో46.3, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 46.2,జగిత్యాల జిల్లా గోదూరులో 46.1, కుమ్రం భీం జిల్లా తిర్యాణీ, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 46, వెల్గనూర్‌లో 45.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



## కేజ్రీవాల్ బెయిల్‌పై
# వాడీవేడీ వాదనలు..



మొదటి పేజీ తరువాయి

అయితే బెయిల్ మంజూరు చేస్తే సీఎంగా కేజ్రీవాల్ అధికారిక బాధ్యతలు నిర్వర్తించ వద్దని సూచించింది. అయితే సుప్రీం అభిప్రాయాన్ని ఈడీ వ్యతిరేకించింది. సీఎం అని ప్రత్యేకంగా బెయిల్ ఇవ్వడం సరికాదు. నేరారోపణలు ఎదుర్కొంటున్న ఎంపీలు ఎమ్మెల్యేలం దరికీ బెయిల్ ఇస్తారా?సీఎం అయినంత మాత్రానమినహాయింపు ఉండదు. రాజకీయ నాయకులకు మినహాయింపు ఇస్తున్నామా? ఎన్నికలప్రచారం మరింత ముఖ్యమా 6 నెలల క్రితం విచారణకు పిలిస్తే కేజ్రీవాల్ సొంతకారణాలతో విచారణకు రాలేదు. అతను సహకరించి ఉంటే, అరెస్టు చేయాల్సిన అవసరం వచ్చేది కాదు.ఇప్పుడు ఎన్నికల ప్రచారం చేయాలనుకుంటు న్నాను అని వాదిస్తున్నారు. ముఖ్యమంత్రి సమన్లకు గైర్హాజరయ్యారు, ఇది తప్పుడు సందేశాన్ని పంపుతుంది. సీఎం సంతకం లేకపోయినా పరిపాలన ఆగలేదు అని ఈడీ వాదించింది. సీఎం సంతకం లేదని ఎల్జీఫైల్స్ ఆపుతున్నారని కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదించారు.

# పట్టభద్ర ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డి నామినేషన్

మొదటి పేజీ తరువాయి

సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్,ఫేస్‌బుక్ లాంటి పలు అంతర్జాతీయ కార్పోరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేసిన ఆయన రాజకీయాలపై ఆసక్తితో రాజకీయాల్లోకి ప్రవేశించారు.2013లో బీజేపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేపీలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా,రెండు పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతిధిగా పచేశారు. బీజేపీలో వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన రాకేష్ రెడ్డి వరంగల్ కేంద్రంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేసి ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు. కానీ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించకపోవడంతో 2023, నవంబర్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఉన్నత విద్యావంతుడు, మంచి వాగ్దాటి, క్లీన్ ఇమేజ్‌తో పాటు,క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఫలితాలు రాబట్టగల సమర్థత,కష్టపడి పచేసే సొంత టీమ్ ఉంటడం వారికి కలిసొచ్చే అంశాలు.యువతలో, విద్యావంతులలో మంచి పట్టున్న రాకేష్ రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు, ఫాలోయింగ్ ఉండటంతో పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారు. ఇదిలావుంటే జనం లేక రేవంత్ రెడ్డి సభలు వెలవెల పోతున్నాయి. కానీ, కేసీఆర్ మీటింగ్‌లకు జనం ఎదురు చుస్తున్నారు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిఅన్నారు.

## సంపాదకీయం

బుధవారం, మే 8, 2024

# చిచ్చుమాటల వెనుక చర్చనీయాంశాలు

ప్రచారం అన్న మాట వినడానికి ఎంతో పవిత్రంగా, అమాయకంగా కనిపిస్తుంది. ఇప్పుడు వ్యాపిస్తున్న మాటల కాలుష్యాన్ని ఎన్నికల ప్రచారం అనడం చాలా అన్యాయం. ఒకరిని లేదా ఒక విషయాన్ని పైకెత్తడానికి గానీ, కిందికి తోసేయడానికి కానీ, నిజాలను కానీ, వదంతులనుకానీ, అబద్ధాలని కానీ ప్రచారంచేయడాన్ని ఇంగ్లీషులో ప్రాపగాండా అంటారు. ఊదరగొట్టడం అంటే దగ్గరగా ఉంటుంది. ఈ కళలో ఆరితేరిన, పేరుమోసిన వారు చరిత్రలోను, వర్తమానంలోనూ అనేకు లున్నారు. అటువంటి ఒక ఘనాపాటి ప్రకారం, బాగా ప్రభావం వేసే వాదనలను పదే పదే వినిపించడమే ఈ ఊదరకళకు ఊపిరి. అట్లాగని, మెత్తగా, గంభీరంగా ఉండే మాటలు మాట్లాడితే ఉపయోగం లేదు. మనం మాట్లాడేది మేధావుల కోసం కాదు. మేధావులను మనం మార్చలేం, మార్చక్కరలేదు కూడా, కాస్త నోరుపెంచామంటే వాళ్లే లొంగిపోతారు. మనం గురిపెట్టాల్సింది రోడ్లమీద కనిపించే అతి సామాన్యుడిని. మన వాదనలు బాగా మొరటుగా ఉండాలి, సులువుగా అర్థం కావాలి, చాలా పదునుగా ఉండాలి. వాడి బుర్రకి కాదు, మనసుకి, ఆవేశాలకి, సహజాతాలకి తాకేటట్టు మాట్లాడాలి. సత్యం మాట్లాడాలని పట్టింపు అక్కరలేదు. మన ఎత్తుగడలకు, మానసిక తంత్రానికి ఉపయోగపడకపోతే, నిజాలతో మనకు పనిలేదు. నమ్మదగినట్టుగా అబద్ధాలు మాట్లాడాలి. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న ఏమన్నాడంటే, చిన్నాచితకా అబద్ధాల వల్ల ఉపయోగం లేదు. అటువంటివి అందరూ మాట్లాడతారు. పెద్ద, అతి పెద్ద, భారీ అబద్ధం ఆడాలి, దాన్ని పదే పదే వల్లె వేయాలి. అబద్ధం మీద ఆధారపడే పాలనలో, సత్యమే రాజ్యానికి అతి బద్ధశత్రువు. ఈ ఊదర అసత్యవాదం ఎన్నికల సమయంలోనే వ్యాపించి ఉంటుందనుకుంటే పొరపాటు. ప్రచారం లేకుండా ప్రభుత్వాలే ఉండవు. ప్రజలకెప్పుడూ ఏదో నూరిపోయకుండా పాలకులకు గడవదు. లాక్కుని పంచేస్తారు, వాళ్లది తీసుకుని వీళ్లకు ఇచ్చేస్తారు, మంగళసూత్రాలు ఎత్తుకుపోతారు, వంటి ప్రచారానికి చప్పట్లు ఎక్కువ పడుతున్నాయో, అంతకు మించి మరో కొత్తమంత్రం దొరకలేదో ప్రధానమంత్రి, ఆయన సహచరులు రెండో దశ పోలింగ్ తరువాత కూడా అదే హోరును మరింత జోరుతో సాగిస్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు కూడా ఏమీ తక్కువ తినలేదు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు దగ్గర మొదలైన హెచ్చరిక, రిజర్వేషన్లు అన్నీ రద్దు చేస్తారు దాకా విస్తరించింది. సాధారణంగా ఎన్నికల ప్రచారాల్లో తాము అధికారంలోకి వస్తే అది ఇస్తాం, ఇది ఇస్తాం, వాళ్ల కంటె ఎక్కువ మేం ఇస్తాం, వంటి అంశాలను మాట్లాడతారు. అంటే, ప్రధానంగా ఇవ్వడం గురించి మాట్లాడతారు. ఇప్పుడు లాక్కోవడం, తీసేసుకోవడం అన్న అంశాల గురించి మాట్లాడుతున్నారు. అవతలివాళ్లు అధి కారంలోకి వచ్చారో, ఉన్నది కోల్పోతారు అని భయపెడు తున్నారు. ప్రత్యర్థుల బూచీకరణ ఈ సారి ఎన్నికలలో ఒక విశేషం. ఉభయపక్షాలు, పరస్పరం చేసుకుంటున్న నిందా రోపణల ప్రాతిపదిక మీదనే ఈ భయప్రచారం సాగుతున్నది. ప్రజల సంపదనంతా తీసుకుని, పునఃపంపిణీ చేస్తుందని, ప్రధానంగా ముస్లిములకు బట్వాడా చేస్తుందని మోదీ చేస్తున్న ప్రచారం ఆశ్చర్యకరమైనది, బలహీనమైన ఆధారాలకు విచిత్రమైన అన్వయాలను ఇవ్వడం ద్వారా నిర్మించిన వాదన అది. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి అట్లా మాట్లాడడం ఇప్పటికీ మింగుడుపడని వారున్నారు. కానీ మొరటు మాటలను పదే పదే వల్లించడంలో కలిగే సదుపాయం వేరు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చేస్తారని, ప్రజాస్వామ్యం పూర్తిగా బలహీనపడుతుందని, ఇకపైన ఎన్నికలే ఉండవని కాంగ్రెస్ చాలా కాలంగా అంటున్నది. బీజేపీ రెండుదఫాల పాలన ఆధారంగా, ఆ పార్టీ సామాజిక విశ్వాసాల ఆధారంగా చేస్తున్న భవిష్యత్ అంచనా అది. రాజకీయసైద్ధాంతిక అంచనా. రోడ్డుమీది సామాన్యుడికి కూడా అందడానికి వీలుగా, మొత్తంగా రిజర్వేషన్లే రద్దు అవుతాయని ఆ వాదనను మెరుగుపరిచి, కాంగ్రెస్ ప్రచారంలో పెట్టింది. అధికారం కోల్పోతామేమోనన్న భయమో, అధికారం దక్కించుకోవాలన్న ప్రయత్నమో, పార్టీల చేత ఉద్వేగపూరితమైన అధమస్థాయి ప్రచారానికి ప్రేరేపిస్తూ ఉండవచ్చు. ప్రజలు ఇంతకంటె మెరుగైన అంశాలను, తమ మనుగడకు సంబంధించిన సామాజికార్థిక అంశాలను ఎన్నికల సందర్భంలో చర్చించాలని ఆశిస్తారన్నది నిజమే. అట్లాగని రిజర్వేషన్ల అంశం, రాజ్యాంగాన్ని కాపాడు కోవడం ప్రజలకు సంబంధించని అంశాలేమీ కాదు. కానీ, ముస్లిమ్ రిజర్వేషన్ల అంశం ఆవేశకావేశాలు రగిలించే రీతిలో ఇంత ప్రాధాన్యం ఇవ్వవలసిన అంశమా? ప్రాధాన్యం ఇస్తే, సచార్ కమిషన్ సిఫారసుల ప్రకారం న్యాయమైన సానుకూల చర్యలను పార్టీలు ప్రతిపాదించాలి. కానీ జరుగుతున్నదేమిటి? ముస్లిములందరికీ రిజర్వేషన్లు కల్పించే కర్ణాటక నమూనాను విమర్శించడంలో ఒక వాదన ఉన్నది. మొత్తంగా ఒక మతవర్గానికి రిజర్వేషన్లు కల్పించడం మతప్రాతిపదిక రిజర్వేషన్లు అవుతాయి. మరి తెలంగాణలో కూడా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని అంటున్నారు. తెలంగాణలో ముస్లిములలోని కొన్ని వెనుకబడిన శ్రేణులకు వెనుకబడిన తరగతులలో భాగంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. మరి అవి మతప్రాతిపదిక రిజర్వేషన్లు కావే? మరి ప్రధానమంత్రి వాదన మతప్రాతిపదిక రిజర్వేషన్లకు వ్యతిరేకంగానా? ముస్లిములకు వ్యతిరేకంగానా? ఈ చర్చ అంతా ఒక విభజన వాతావరణానికి ఆస్కారం ఇచ్చి, ఉద్వేగాల మీదికి దారిమళ్లిస్తుంది. దేశవనరుల మీద మొదటి హక్కు అట్టడుగు వర్గాలకు ఉంటుందన్నది అందరూ అంగీకరించవలసిన అంశం. మన్మోహన్ సింగ్ అన్నమాటలను ఇవాళ తప్పుపడుతున్నది కానీ, ఇరవయ్యేళ్ల నుంచి బీజేపీ సిద్ధాంతంగాను, పదేళ్లుగా ప్రభుత్వ విధానాల్లో ఒకటిగాను ఉన్న 'అంత్యోదయ' అర్థం ఏమిటి? చిట్టచివరన ఉన్నవారికి కూడా అభివృద్ధిఫలాలు అందడమే కదా? ఆ అట్టడుగు వర్గాలలో ముస్లిములు ఉండకూడదంటే, వారిలో వెనుకబాటు లేదని శాస్త్రీయంగా నిరూపించాలి.

# దీదీ సర్కారుకు సుప్రీం సూచన



న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంపై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా బెంగాల్ ప్రభుత్వానికి కఠిన ప్రశ్నలు సంధించింది. ఎంపిక ప్రక్రియ అంశం కోర్టులో ఉండగానే కొత్త పోస్టులు సృష్టించి నియామకాలు ఎలా చేపట్టారని ప్రశ్నించింది. వ్యవస్థపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోతే ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటారని ఆగ్రహించింది. బెంగాల్‌లో 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ నియామక ప్రక్రియ చెల్లదని ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే 25, 743 మంది టీచర్లు , నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వం లోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా దీదీ సర్కారు తీరుపై అసహనం వ్యక్తం చేసింది. " ఇది వ్యవస్థీకృత మోసమే. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల నియామకాల్లో అవతవకలు జరిగితే , వ్యవస్థలో ఇంకేం మిగులుతుంది? వ్యవస్థపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోతే దాన్ని మీరు ఎలా ఎదుర్కొంటారు? ప్రజల నమ్మకం పోతే ఇంకేం మిగలదు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా నియామక ప్రక్రియకు సంబంధించిన డేటాను ఎందుకు భద్రపర్చలేదంటూ రాష్ట ప్రభుత్వాన్ని నిలదీసింది. ." ఆ డేటా ఉందా లేదా ? నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలను డిజిటల్ రూపంలో భద్ర పర్చడం స్కూల్ సర్వీస్ కమిషన్ బాధ్యత " అని గుర్తు చేసింది. ప్రభుత్వ ప్రాయోజిత , ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతోపాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన రిక్రూట్ మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఇందులో అవకతవకలు జరిగినట్టు అప్పట్లోనే ఆరోపణలు రాగా, ఈ వ్యవహారం కోర్టుకు చేరింది. ఆ అంశం పెండింగ్‌లో ఉండగానే అందులో ఎంపిక ప్రక్రియను చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఖాళీల కంటే అదనంగా కొంతమందిని నియమించడంపై వివాదాస్పదమైంది. ఈ క్రమం లోనే నాటి నియామక ప్రక్రియను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది.

# అవినీతిపరులను ప్రోత్సహిస్తున్న బిజెపి



**చిర్మిరి(ఛత్తీస్‌గఢ్):** అవినీతిపరులను, ప్రజా సంక్షేమం పట్టని వారిని మాత్రమే బిజెపి ప్రోత్సహిస్తుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. ప్రజలకు 5 కిలోల రేషన్ ఇచ్చి వారు తమపైన ఆధారపడాలన్నది బిజెపి ఆలోచనని, ప్రజలు దీనికి బదులుగా ఉద్యోగాలు కోరాలని ఆమె సూచించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మహేంద్రగఢ్–చిర్మిరి–భరత్‌పూర్ జిల్లాలోని చిర్మిరి పట్టణంలో మంగళవారం ఒక ఎన్నికల సభలో ఆమె ప్రసంగిస్తూ దేశానికి చెందిన ఆస్తులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కొందరు కోటీశ్వరులకు కట్టబెడుతోందని ఆరోపించారు. దేశంలో ఎటువంటి రాజకీయాలు జరుగుతున్నాయి, దేశంపై ఏరకంగా దాడి జరుగుతోంది, ఎటువంటి నాయకులను పెంచిపోషిస్తున్నారో దేశ ప్రజలు తెలుసుకోవలసిన అవసరం ఉందని ఆమె అన్నారు. రెండు రకాల నాయకులను బిజెపి పెంచిపోషిస్తోందని, ఒకరు అత్యంత అవినీతిపరులని ఆమె తెలిపారు. అవినీతిపరులైన నాయకులందరినీ ఒకచోటకు చేర్చి తమ శిబిరంలోకి బిజెపి తీసుకుంటోందని ఆమె చెప్పారు. ఇతర పార్టీలలోని అవినీతి నాయకులపై మొదట ఆరోపణలు చేస్తారని, వారిపైన ఒత్తిడి పెట్టి వారిని బిజెపిలోకి రప్పించుకుంటారని ఆమె చెప్పారు. బిజెపిలో చేఇరన తర్వాత వారంతా నిజాయితీపరులై పోతారని, వారిపైన ఎటువంటి కేసులు ఉండవని ప్రియాంక తెలిపారు. ఇక రెండవ రకం నాయకులు వారు ప్రజా సమస్యల గురించి ఎక్కడా మాట్లాడరని ఆమె అన్నారు. ధరల పెరుగుదల గురించి, ప్రజలు ఎందుర్కొంటున్న సవాళ్ల గురించి వారు మాట్లాడరని ఆమె అన్నారు. ఈ రెండు రకాల నాయకులనే బిజెపి ప్రోత్సహిస్తుందని ఆమె చెప్పారు. కాని కాంగ్రెస్ పార్టీలో ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారి కోసం పనిచేసే వారినే ప్రోత్సహిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రజలు ఒకపక్క తీవ్ర కష్టాలు ఎదుర్కొంటుంటే బిజెపి మాత్రం జి20, పాకిస్తాన్, చైనా వంటి భారీ ఈవెంట్లు నిర్వహిస్తుందని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోకు న్యాయ పత్ర అని పేరు పెట్టిందని, పదేళ్ల నరేంద్ర మోడీ పాలనలో ప్రజలకు న్యాయం ఏమైనా జరిగిందా అని ప్రియాంక ప్రశ్నించారు.

# ఒడిశా పేదరికానికి బిజెడి కారణం: మోడీ



స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా ఒడిశాను పేద రాష్ట్రంగా మారడానికి కాంగ్రెస్, బిజూ జనతా దళ్(బిజెడి) కారణమని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. సోమవారం నాడిక్కడ ఎన్నకల ప్రచారంలో భాగంగా ఒక ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఒడిశాకు నీరు, సారవంతమైన భూమి, ఖనిజాలు, సుదీర్ఘమైన కోస్తా తీరం, చరిత్ర, సంస్కృతి.అన్నిటిని భగవంతుడు ఇచ్చాడని అన్నారు. అయినప్పటికీ ఒడిశా ప్రజలు ఎందుకు పదరికంలో మగ్గుతున్నారని ప్రధాని ప్రశ్నించారు. దీనికి సమాధానం మొదటి కాంగ్రెస్ నాయకులు లూటీ చేయగా తర్వాత బిజెడి నాయకులు లూటీ చేశారని ప్రధాని ఆరోపించారు. బిజెడికి చెందిన చిన్న నాయకులకు సైతం పెద్ద బంగళాలు ఉన్నాయని ఆయన చెపారు. గంజాం జిల్లాలో ఒక ప్రచార సభలో ప్రధాని ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న హింజిలి నియోజవకర్గం కూలీలు ఎందుకు ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని ప్రశ్నించారు. ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్ పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంటున్నాయని ప్రధాని నిలదీశారు. ఎందుకు పిల్లలు మధ్యలోనే స్కూళ్లను మానేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఒడిశా అభివృద్ధి కోసం నిధులు కేటాయించడానికి తాను ఎన్నడూ వెనుకాడలేదని ప్రధాని చెప్పారు. కేంద్రంలో సోనియా గాంధీ చేతిలో రిమోట్ కంట్రోల్ ఉన్న మన్మోహన్ సింగ్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నపుడు ఒడిశాకు పదేళ్లలో రూ. 1 లక్ష కోట్లు అందయాని, కాని తన ప్రభుత్వం పదేళ్లలో రూ. 3.5 లక్షల కోట్లు అందచేసిందని మోడీ చెప్పారు. అయితే నిధులు సమకూర్చినంత మాత్రాన అభివృద్ధి జరగదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. మహిళల సంక్షేమం ఒడిశా ప్రభుత్వానికి పట్టలేదని ఆయన ఆరోపించారు. గర్భిణులకు నెలకు రూ. 6000 సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తోందని, ఈ ముఖ్యమైన పథకాన్ని ఒడిశా ప్రభుత్వం నిలిపివేసిందంటే మీరు ఆశ్చర్యపోతారని మోడీ తెలిపారు. జల్ జీవన్ మిషన్ కోసం రూ. 10,000 కోట్లను కేంద్రం పంపిస్తే ఆ నిధులను కూడా ఇక్కడి ప్రభుత్వం ఖర్చు చేయలేదని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం కోసం మోడీ నిధులు పంపించినప్పటికీ రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉచిత బియ్యం కోసం మోడీ డబ్బు పంపిస్తే బియ్యం పాకెట్లపై బిజెడి ప్రభుత్వం తన బొమ్మ వేసుకుంటుంది అని మోడీ విమర్శించారు. బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని ఒడి శా ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని ప్రధాని తెలిపారు. జూన్ 4తో బిజెడి ప్రభుత్వానికి కాలం చెల్లిపోతుంది. ఒడిశా అభివృద్ధికి బిజెపి ఒక ఆశాకిరణం అని ఆయన అన్నారు. ఒడిశాలోని 21 లోక్‌సభ స్థానాలు, 147 అసెంబ్లీ స్థానాలకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా ఒడిశాలో తదుపరి ప్రభుత్వాన్ని బిజెపి ఏర్పాటు చేస్తుందన్న ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించారు. బిజెపి పగటి కలలు కంటోంది అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

# నయ్యా సాగ్గిని ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా నియమించిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్



హైదరాబాద్: హోమ్ టెక్స్‌టైల్స్, ఫ్లోరింగ్ సొల్యూషన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ టెక్స్‌టైల్స్‌లో అగ్రగామిగా ఉన్న వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్, తమ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా నయ్యా సాగ్గిని నియమించినట్లు వెల్లడించింది. 2024 ఏప్రిల్ 25 నుండి ఈ నియామకం అమల్లోకి రానుంది. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా తొలుత నాలుగు సంవత్సరాల పాటు సాగ్గి కొనసాగుతారు. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఆమె పదవీకాలం 2028 ఏప్రిల్ 24తో ముగుస్తుంది. ఈసందర్భంగా నయ్యా సాగ్గి నియామకంపై వెల్‌స్పన్ లివింగ్ సీఈఓ అండ్ ఎండి దీపాలి గోయెంకా మాట్లాడుతూ%ౌ% నయ్యా చేరిక వెల్‌స్పన్ లివింగ్‌కు ఒక వ్యూహాత్మక మైలురాయిని సూచిస్తుందన్నారు. వినియోగదారుల కేంద్రీకృత పరిశ్రమలలో సాగిన ఆమె వ్యవస్థాపక ప్రయాణంలో ఆమె నైపుణ్యం, కొత్తదనాన్ని తెస్తుందన్నారు. నయ్యా వ్యూహాత్మక పరిజ్ఞానం, ముఖ్యంగా ఆమె బీ2సీ అండ్ ఇ కామర్స్ అనుభవం వెల్‌స్పన్ లివింగ్ బీ2సీ వృద్ధి పథాన్ని ముందుకు తీసుకువెళ్లనుందన్నారు. నయ్యా సాగ్గి తన నియామకంపై మాట్లాడుతూ%ౌ% వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్‌లో ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా చేరడం ఒక గౌరవంగా భావిస్తున్నానన్నారు. శ్రేష్ఠత అండ్ ఆవిష్కరణల పట్ల వెల్‌స్పన్ నిబద్ధత ప్రశంసనీయమన్నారు. దాని నిరంతర విజయానికి దోహదపడాలని తాను ఎదురు చూస్తున్నానన్నారు. వినియోగదారు–కేంద్రీకృత పరిశ్రమల్లో తన అనుభవం, బ్రాండ్ బిల్డింగ్‌లో బలమైన డిజిటల్ డీఎన్ఏ తీసుకురావడం, లాభం, ఉద్దేశ్యంతో స్థిరమైన, సమగ్ర వృద్ధి పట్ల తన అభిరుచి, వెల్‌స్పన్ విలువలతో సంపూర్ణంగా సరిపోలతాయని తాను నమ్ముతున్నానన్నారు. వ్యూహాత్మక కార్యక్రమాలను నడపడానికి, వాటాదారుల కోసం విలువను సృష్టించడానికి బోర్డు, మేనేజ్మెంట్ టీంతో కలిసి పనిచేయటానికి ఎదురుచూస్తున్నానన్నారు.

# పోలింగ్ బూత్‌ల లూటీకి బీజేపీ యత్నం : అఖిలేశ్ యాదవ్



ఎటవా (యుపి) : మణిపూర్‌లో లోక్‌సభ నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌లను కాజేయడానికి బీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారని, అందుకనే విపక్షసభ్యులను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మంగళవారం ఆరోపించారు. ఈ లోక్‌సభ స్థానానికి మూడో దశలో మంగళవారం పోలింగ్ జరిగింది. మణిపూర్ నియోజక వర్గం లోని సైఫై (ఎటావా) వద్ద అఖిలేశ్ ఓటు వేశారు. ఈ స్థానం నుంచి అఖిలేశ్ యాదవ్ భార్య, ప్రస్తుత ఎంపీ డింపిల్ యాదవ్ పోటీలో ఉన్నారు. బీజేపీలో అధికారం కోసం అంతర్గత పోరు సాగుతోందని, అందుకనే ఆ నాయకులు స్వయం బుజ్జగింపు ప్రకటనలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కొన్ని చోట్ల రిగ్గింగ్ జరుగుతోందని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం బలగాలను ఉపయోంచుకుంటోందని సమాచారం అందిందన్నారు. పోలింగ్ బూత్‌లకు బయట అధికారులు నియామకమయ్యారని ఆరోపించారు. కేంద్రం ప్రతిపాదించిన మూడు కొత్త వ్యయసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమంలో వెయ్యిమందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయినా, కనీస మద్దతు ధర కల్పించడం లేదని ధ్వజమెత్తారు. 2021లో లఖింపూర్ ఖేర్ హింసాత్మక సంఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ రైతుల మీదుగా కేంద్రమంత్రి కారు నడిపించారని ఆరోపించారు. ఆ కారులో కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా తనయుడు ఆశిష్ మిశ్రా ఉన్నాడని పేర్కొన్నారు.. " ఈ నాయకులు రైతుల మీదుగా కార్లు నడుపుతారని , 2014లో బీజేపీ అధికారం లోకి వచ్చిన దగ్గర నుంచి లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. నిప్పులు చెరిగే ఎండల్లో ఎన్నికలు నిర్వహించడం ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని విమర్శించారు. ఏదేమైనా ఓటర్లు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఓటును వేయాలని కోరారు. ఈ ఓటు ప్రజల జీవితాలనే మారుస్తుందని, ఇదే ఓటు రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఎస్‌పి నేత రామ్‌గోపాల్ యాదవ్ కూడా సైఫైలో ఓటు వేశారు. బీజేపీ మళ్లీ అధికారం లోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందన్నారు. బీజేపీ కొత్త రాజ్యాంగం కోసం సిద్ధమైందని, ఎవరైనా అధికారం లోకి వస్తే నియంతృత్వం దిశగా ముందుకు వెళ్తారని రామ్‌గోపాల్ విమర్శించారు. ఈ ఎన్నికలు రామభక్తులకు, రామద్రోహులకు మధ్య జరుగుతున్నవని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావించగా, అధికార మత్తులో మునిగితే ఆ వ్యక్తి ఏదైనా మాట్లాడుతాడని ధ్వజమెత్తారు.

## భారీ వర్షానికి హైదరాబాద్ నగరం గజగజ

హైదరాబాద్ జంట నగరాల పరిధిలోని పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. ఎండలకు మండిపోయిన నగరం ఈ వర్షానికి చల్లబడింది. దీంతో నగర వాసులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది. నగరంలోని పంజాగుట్ట, ఫిలింనగర్, అమీర్ పేట్, మెహిదీపట్నం, టోలిచౌకి, గచ్చిబౌలి గోల్కొండ, కోఠి, ఉప్పల్, ఖైరాతాబాద్, ఎర్రగట్ట, కూకట్‌పల్లి, నిజాంపేట, కేపీహెచ్‌బీ, లిగంపల్లి, కొండాపూర్, మియాపూర్, సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యారడైజ్, మారేడ్‌పల్లి, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, సుచిత్ర, జీడిమెట్ల, బహదూర్‌పల్లి, పేట్‌బషీరాబాద్ మేడ్చల్ లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోయింది. వర్షం ధాటికి నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది.



# అమ్మకు గొప్ప గిఫ్ట్ ఇవ్వబోతున్నా..

పరిణీతీ చోప్రా అమ్మకూచి. ఆమెకు తన తల్లి రీనా చోప్రా అంటే అపారమైన ప్రేమ. వారిద్దరి అనుబంధం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. 'అమ్మ నాకు మంచి ఫ్రెండ్. నాపై ఆమె చూపిస్తున్న ప్రేమను జీవితంలో మరిచిపోలేను. తనకెప్పుడూ రుణపడే ఉంటాను. మా అమ్మది చిన్నపిల్ల మనస్తత్వం. ఇప్పటికీ నేనే చాలా నేర్పుతుంటాను. కొన్ని సందర్భాల్లో నేను తల్లిగా, ఆమె కూతురిగా మారిపోతుంటాం. నాకు స్కూబా డైవింగ్ బాగా వచ్చు. అమ్మక్కూడా నేర్పించా. తను కూడా ఇప్పుడు బాగా స్కూబా ఆడుతుంది. అంతేకాదు, భౌతికంగా ఇద్దరం దూరంగా ఉన్నా, ఆన్‌లైన్‌లో కలిసే ఉంటాం. దూరంగా ఉండి కూడా గేమ్స్ ఆడుకుంటాం. ఈ నెల 12న మదర్స్ డే. ఆ రోజున అమ్మకు గొప్ప గిఫ్ట్ ఇవ్వబోతున్నాను. అదేంటో ఇప్పుడే చెప్పను.. సస్పెన్స్' అని చెప్పుకొచ్చింది పరిణీతి చోప్రా.

# నా పేరు వెనుక చాలా కథ..

'ప్రేమలు' సినిమాతో యువతరం అంతా మమిత ప్రేమలో పడిపోయారు. ఇన్‌స్టాలో ఆమె రీల్స్‌కి ఉన్న ఫాలోయింగ్ మామూలుగా లేదు. సోషల్ మీడియా సంచలనంగా మారింది మమిత. ప్రస్తుతం మలయాళంతోపాటు తమిళంలో కూడా సినిమాలు చేస్తున్నది మమిత. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో తన పేరుకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'నిజానికి నా పేరు నమిత. మమిత కాదు. నేను పుట్టినప్పుడు హాస్పిటల్ సిబ్బంది బర్త్ సర్టిఫికెట్‌లో నా పేరును మమితగా నమోదు చేశారు. నేను స్కూల్‌లో చేరేటప్పుడు ఈ పొరపాటు వెలుగు చూసింది. ఇంట్లో అందరూ షాక్. ఇక చేసేది లేక మమితగానే స్కూల్లో జాయిన్ అయ్యాను. మమిత అంటే మిఠాయి అని అర్థం.' అంటూ చెప్పుకొచ్చింది మమిత. ఇంకా చెబుతూ 'ప్రేమలు' నా తొలి సినిమా అని అందరూ అనుకుంటున్నారు. నిజానికి అది నా పదహారో సినిమా. మలయాళంలో ఇప్పటికే చాలా సినిమాలు చేశాను.' అని అందంగా నవ్వేసింది మమిత.



# గేమ్‌చేంజర్ షూటింగ్..

'గేమ్‌చేంజర్' సినిమా విషయం ఎప్పటికప్పుడు కొత్త అప్‌డేట్లు వెలుగు చూస్తున్నాయి. సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉండటంతో గాసిప్పులు కూడా అదే స్థాయిలో హల్‌చల్ చేస్తున్నాయి. రీసెంట్ అప్‌డేట్ ప్రకారం ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో సోమవారం మొదలుకానున్నదట. ప్రధాన తారాగణం మొత్తం ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారట. కథ ప్రకారం ఇది కీలకమైన షెడ్యూల్ అని, ఈ షెడ్యూల్‌లోనే రామ్‌చరణ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ని దర్శకుడు శంకర్ తెరకెక్కించనున్నారని సమాచారం. అంచనాలకు తగ్గట్టుగా భారీ వాణిజ్య విలువలతో రూపొందుతోన్న ఈ సినిమాలో రామ్‌చరణ్ తండ్రికొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. తండ్రి పాత్రకు జోడీగా అంజలి, కొడుకు పాత్రకు జోడీగా కైరా అద్వానీ నటిస్తున్నారు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నవీన్‌చంద్ర ఇందులో కీలక పాత్రధారులు. తమన్ స్వరాలందిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా



# ప్రేమ పాఠశాల

నవీద్‌ఖాన్, స్నేహ శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ది స్కూల్'. 'ప్లేస్ ఆఫ్ లెర్నింగ్' అనేది ఉపశీర్షిక. వాల్మీకి దర్శకుడు. శివ రెమిడాల నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి టీఎఫ్‌సీసీ మెంబర్ పద్మిని నాగులపల్లి కెమెరా స్విచాన్ చేసి యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. సహజత్వం ఉట్టిపడేలా సినిమాను తీయగల దర్శకుడు వాల్మీకి అని, వాస్తవసంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కచ్చితంగా విజయాన్ని సాధిస్తుందని హీరో నవీద్ ఖాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా దర్శక, నిర్మాతలు కూడా మాట్లాడారు. ఇంద్రజ, కృష్ణభగవాన్, రాజారవీంద్ర, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ ఠాకూర్. మాటలు, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం: వాల్మీకి.





# రెండేళ్లకే బ్రేకప్..

బాలీవుడ్‌లో ఎక్కువగా వినిపించే పేర్లలో అనన్య పాండే ఒకరు. చేసిన సినిమాలు హిట్ అయినా.. కాకపోయినా.. ఎప్పుడూ ఏదో ఒక టాపిక్‌తో ఆమె పేరు వినిపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా బాలీవుడ్ హీరో ఆదిత్యరాయ్ కపూర్‌తో ఆమె ప్రేమాయణంపై కొద్దిరోజులుగా రూమర్స్ వస్తూనే ఉన్నాయి. చాలా రోజులుగా వీరిద్దరూ కలిసి ఈవెంట్స్, రెస్టారెంట్స్, పార్టీల్లో కనిపించారు. దీంతో వీళ్లిద్దరూ నిజంగానే లవ్ బర్డ్స్ అని బీటౌన్ కన్ఫార్మ్ చేసేసింది. అయితే ఈ జంట ఇప్పుడు విడిపోయిందట. రెండేండ్ల ప్రేమకు వీళ్లిద్దరూ బ్రేకప్ చెప్పారనే వార్త ఇప్పుడు బీటౌన్ సర్కిల్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. ఆదిత్యరాయ్ కపూర్, అనన్య బ్రేకప్ విషయాన్ని వాళ్ల సన్నిహితుడు ఇటీవల ధృవీకరించాడు. ఒక చిట్‌చాట్‌లో పాల్గొన్న అతను.. ఆదిత్య, అనన్య ఇద్దరూ నెల క్రితం విడిపోయారని క్లారిటీ ఇచ్చారు. వాళ్లిద్దరూ చాలా క్లోజ్‌గా ఉండేవారని.. ఒకరితో మరొకరు చాలా అన్యోన్యంగా ఉండేవారని చెప్పాడు. కానీ ఇలా సడెన్‌గా విడిపోవడం మా అందరికీ షాకిచ్చిందని పేర్కొన్నాడు. ప్రస్తుతం అనన్య మూవ్ ఆన్ అయ్యేందుకు ప్రయత్నిస్తుందని అన్నాడు. బ్రేకప్ గాయం ఆమెకు గట్టిగా తగిలిందని.. ఆ బాధను మరిచిపోయేందుకు పెంపుడు జంతువులతో ఎక్కువ సమయం గడుపుతోందని చెప్పాడు. ఆదిత్యరాయ్ కపూర్ కూడా మెచ్యూరిటీతో పరిస్థితిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నాడు. అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలో ఆదిత్య రాయ్ కపూర్, అనన్య పాండే చివరిసారిగా కలిసి కనిపించారు. ఆ తర్వాత ఎక్కడ కూడా జంటగా కనిపించలేదు. ప్రీ వెడ్డింగ్ వేడుకలో పాల్గొని ముంబై వచ్చిన తర్వాతే తమ రిలేషన్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారట. అనన్య సన్నిహితులు చెప్పిన దాని ప్రకారం మార్చిలోనే వీరిద్దరూ విడిపోయినట్లు తెలుస్తోంది.